

హైదరాబాద్ వార్త

# జూబ్లీహిల్స్ ఆశావహుల్లో యమ టెన్షన్

- ఇప్పటికే గ్రౌండ్ రియాలిటీ తెలుసుకున్న మీనాక్షీ నటరాజన్
- స్పష్టమైన అవగాహనతో అధిష్టానానికి నివేదిక
- ముగ్గురు అభ్యర్థుల పేర్లతో నివేదిక ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం..
- అభ్యర్థి ఎవరైనా గెలుపు తథ్యమని అధిష్టానానికి భరోసా ఇచ్చిన సిఎం రేవంత్

**పంజగుట్ట,జూలై 8 (ప్రభాతవార్త):** మీనాక్షి నటరాజన్..ఇపుడీమె పేరు జూబ్లీహిల్స్ ఆశావహుల్లో గుబులు రేపుతుంది. కరుడుగట్టిన కాంగ్రెస్ వాది.రాహుల్ గాంధీ కోర్ టీంలో ముఖ్యురాలు. ఈమెను తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా నియమించినప్పటి నుండి కాంగ్రెస్ నేతల్లో ఒకింత కంగారు మొదలైందని చెప్పవచ్చు. ఎలాంటి పైరవీలకు, రికమండేషన్లకు ఆమె లొంగరు. గ్రౌండ్ రియాలిటీ తెలుసుకున్న తర్వాత మాత్రమే నిర్ణయాలు తీసుకుంటారు.పార్టీకోసం పనిచేసిన వారికి న్యాయం చేయాలనే తపన ఆమెలో కనబడుతుంది. పైగా ఆమె చార్జ్ తీసుకున్న తర్వాత జరుగనున్న మొదటి ఎన్నిక జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కావడంతో ఆమె దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రజలలో ఎవరికి మంచి ఆదరణ ఉందనే విషయాన్ని మాత్రమే ఆమె తెలుసుకుంటున్నారు. పార్టీని గెలుపుతీరాలకు చేర్చే నేతకే జూబ్లీహిల్స్ అసెంబ్లీ టికెట్ ఇవ్వాలని ఆమె ఇప్పటికే నిర్ణయించుకుని అధిష్టానానికి ఒక నివేదిక కూడా పంపారని విశ్వసనీయ సమాచారం. దీంతో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పోటీ చేయాలనుకునే ఆశావహులు యమా టెన్షన్ పడిపోతున్నారు. ఏఏ అంశాల ఆధారంగా ఆమె నిర్ణయం తీసుకోబోతున్నారనే విషయంలో ఎలాంటి హింట్ బయటకు రాకపోవడంతో సీనియర్ నేతలు సైతం ఎవరికి టికెట్ కేటాయించబోతున్నారనే విషయంలో కనీసం అంచనా కూడా వేయలేకపోతున్నారు. రాష్ట్రంలో పార్టీ అధికారంలో ఉండడంతో సహజంగానే నాయకులకు గెలుపుపై ఆశలు పెరుగుతాయి.దీతో వివిధ వర్గాలకు సంబంధించిన నేతలు తమకు ఎందుకు అవకాశం ఇవ్వకూడదనే విషయంలోఅధిష్టానానికి బయోడేటాలు సమర్పిస్తున్నారు.సీయం రేవంత్‌రెడ్డి డిప్యూటీసీయం భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌లను కలిసి తమ అభ్యర్థిత్వానికి మద్దతు ఇవ్వవలసిందిగా వేడుకుంటున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పోటీ చేయడానికి స్థానికులే కాక పక్క నియోజకవర్గాల వారు, పక్క జిల్లాల వారు కూడా ఆసక్తి కనబరుస్తున్నారు. ఇప్పటికే గతంలో పోటీచేసి ఓటమి పాలైన క్రికెటర్ మహ్మద్ అజారుద్దీన్ తాను పోటీలో ఉన్నాని అధిష్టానం తనకే టికెట్ కేటాయిస్తుందని ఆశాభావంతో ఉన్నారు. ఈ విషయంలో ఆయన భహిరంగంగానే తన అభిలాషను వ్యక్తం చేశారు. నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి తన పదవి కాలం ఫిబ్రవరిలో ముగిస్తున్న నేపథ్యంలో ఉప ఎన్నికల్లో గెలిచి మంత్రి పదవి సాధించాలని దృష్టి పెట్టారు. మరోనేత నవీన్‌యాదవ్ కూడా తనకు టికెట్ దక్కుతుందనే ఆశాభావంతో ఉండి డివిజన్‌లలో తన అనుచరులను యాక్టివ్ చేస్తున్నారు. గతంలో తన తండ్రి ప్రాతినిధ్యం వహించిన ప్రాంతం కాబట్టి తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే పీజెఆర్ కుమార్తె, ప్రస్తుత ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి కూడా కోరుతున్నారు. అదేవిధంగా నాంపల్లికి చెందిన సీనియర్ మైనారిటీ నేత ఫిరోజ్‌ఖాన్ కూడా తన ప్రయత్నాలను ముమ్మరం చేశారు.వీరు కాక మాజీ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జట్టి కుసుమకుమార్ కూడా అవకాశం ఇస్తే పోటీ చేయాలనే ఆలోచనతో ఉన్నట్లు సమాచారం.

వీరు కాక మరో ఐదారుగురు ఆశావహులు అంతర్గతంగా టికెట్ కోసం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఈ విషయంలో సీయం,డిప్యూటీసీయం,పీసీసీ చీఫ్‌లు తమ వద్దకు వచ్చిన వారికి ఎలాంటి భరోసా ఇవ్వకుండా అధిష్టానం ఆలోచనకే ఓకె చెప్పాలనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. దీంతో ఇపుడు మీనాక్షి నటరాజన్ కోర్టులో బంతి ఉండడంతో ఆమె ప్రసన్నం కోసం ఆశావహులు రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు.

ఇప్పటికే జూబ్లీ హిల్స్‌పై ఓ నిర్ణయానికి వచ్చిన ఆమె పూర్తి స్థాయి నివేదికను, ఎవరికి టికెట్ కేటాయిస్తే గెలుపు సాధ్యమనే విషయం ముగ్గురు పేర్లతో ఎఐసీసీ చీఫ్ ఖర్గేకు, ముఖ్యనేత రాహుల్‌గాంధీకి పంపినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో వడపోతలో తమ పేరు ఉందో లేదోనని ఆశావ హుల్లో టెన్షన్ మొదలైంది.సీయం రేవంత్‌రెడ్డి మాత్రం అభ్యర్థి ఎవరనే విషయంతో సంబంధం లేకుండా జూబ్లీహిల్స్‌లో గెలుపు తథ్యమని అధి ష్టానానికి భరోసా ఇచ్చినట్లు సమాచారం.

# మీపిల్లలకు గురుకులం సీట్లు ఇచ్చి చదివిస్తాం

- జిహెచ్ఎంసి శానిటేషన్ వర్కర్స్‌కు మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ
- సిబ్బంది ఆరోగ్య రక్షణకు ప్రత్యేక క్యాంప్.. హెల్త్ కిట్లు పంపిణీ



సిబ్బందికి హెల్త్‌కిట్ అందజేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్,మేయర్ విజయలక్ష్మీ, కమిషనర్ ఆర్.వి.కర్ణన్, కలెక్టర్ హరిచందన, ఏసీ రఘుప్రసాద్

**హైదరాబాద్,జూలై 8,ప్రభాతవార్త:** ఆరోగ్య తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం బంజారాహిల్స్ కొమురం భీం భవన్ లో జిహెచ్ఎంసి శానిటేషన్ సిబ్బందికి ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంప్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక హెల్త్ క్యాంప్‌లో మంత్రి ఆరోగ్య పరీక్షలు చేసుకున్నారు. అనంతరం జీహెచ్ఎంసీ శానిటేషన్ సిబ్బందికి వ్యక్తిగత పరికరాల కిట్స్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, జీహెచ్ఎంసీ కమీషనర్ ఆర్.వీ.కర్ణన్, హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన లతో కలిసి పంపిణీ చేసారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ హైదరాబాద్ మహానగరాన్ని జిహెచ్ఎంసి వర్కర్లు పరిశుభ్రంగా ఉంచుతున్నారని అన్నారు. జీహెచ్ఎంసీలో పని చేస్తున్న ప్రతి శానిటేషన్ సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు చేస్తూ నెల వారి మందులు ఇచ్చే కార్యక్రమం ప్రారంభమైందని అన్నారు. మీ ఆరోగ్యాన్ని కాపాడడానికి తీసుకున్న నిర్ణయంలో భాగంగా మీ అందరి జీతాలు పెంచాలనే ఆలోచన ప్రభుత్వంలో ఉందన్నారు. అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు వచ్చాయని, హైదరాబాద్ లో స్థలం ఉన్న వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కొన్ని స్లమ్స్ డెవలప్ చేస్తూ అక్కడ నిర్మాణాలు చేపట్టి మీకు ఇవ్వాలని ప్రణాళికలు చేయనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ కి పెట్టుబడులు వస్తున్నాయంటే పారిశుధ్య కార్మికులు అద్దం లెక్క హైదరాబాద్‌ను ప్రపంచానికి చూపెడుతున్నారన్నారు. మీ పిల్లలకు చదువులు ఇబ్బంది ఉన్న అధికారుల దృష్టికి తీసుకురావాలని గురుకులాల్లో సీట్లు ఇచ్చి చదివించే బాధ్యత మాది అని పారిశుధ్య కార్మికులకు మంత్రి హామీ ఇచ్చారు. మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ... శానిటేషన్ సిబ్బంది తరచుగా ఆరోగ్య సమస్యలకు గురి కాకుండా జాగ్రత్తలు పాటిస్తూ ప్రభుత్వం అందజేసిన కిట్స్‌ను తప్పక సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్మికుల ఆరోగ్యం విషయంలో జిహెచ్ఎంసి ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.జిహెచ్ఎంసి కమీషనర్ ఆర్.వికర్ణన్ మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో శానిటేషన్ సిబ్బంది నిరంతరం ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటూ తమ ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, జిహెచ్ఎంసి అదనపు కమిషనర్ రఘు ప్రసాద్, చీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ పద్మజ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి, టీబీ నివారణ అధికారి చల్లా దేవి, అదనపు డిఎంఅండ్ హెచ్ ఓ లు డాక్టర్ విజయనిర్మల, డాక్టర్ మురళీధర్, లెప్రసీ అధికారి డాక్టర్ రాధా కిషన్, తహసీల్దార్ అనిత రెడ్డి, జిహెచ్ఎంసి, అధికారులు, సిబ్బంది ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అవును..బతుకమ్మ కుంటే..

## హైడ్రా పునఃనిర్మాణంతో కొత్తశోభ హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

నాడు



నేడు



**హైదరాబాద్,జూలై 8,ప్రభాతవార్త:** హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో చెరువులు, కుంటల పరిరక్షణే ధ్యేయంగా ఏర్పడ్డ హైడ్రా ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతూ దూసుకుపోతోంది. ఈ క్రమంలో అంబర్ పేట బతుకమ్మ కుంటకు జీవం పోసింది. 5ఎకరాల 15 గుంటల విస్తీర్ణంలో చెట్లు, చెత్తతో నిండిపోయిన బతుకమ్మ కుంటను పునః నిర్మించింది. అంబర్ పేట మండలం బాగ్ అంబర్ పేట్ లోని సర్వే నంబరు 563లో 1962 -63 లెక్కల ప్రకారం 14.06 ఎకరాల విస్తీర్ణంలో బఫర్ జోన్ తో కలిపి మొత్తం 16.13 ఎకరాలు ఉండేంది. అయితే తాజా సర్వే ప్రకారం అక్కడ 5.15 ఎకరాలు మాత్రమే మిగిలింది. ఇండ్ల మధ్యలో ఉన్న బతుకమ్మకుంట రోజురోకు కబ్జాకు గురై కుచించుకుపోతుంది. దీంతో దాన్ని కాపాడాలంటూ కాంగ్రెస్ నేత విహెచ్ హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఆతర్వాత రంగంలోకి దిగిన హైడ్రా దిద్దుబాటు చర్యలు చేపట్టినంది. ఈనేపథ్యంలో కోర్టు కేసులను సైతం ఎదుర్కొని పురుద్ధరించేందుకు చర్యలు చేపట్టింది. నాటి ఎర్రకుంటనే కాలక్రమంలో బతుకమ్మ కుంటగా మారిందని గతంలో చెత్త, నిర్మాణ వ్యర్థాలు పోయడంతో చెరువు ఆనవాళ్లు లేకుండా పోయిందని అయితే హైడ్రా చేపట్టిన చర్యలతో నాటి కుంటను కళ్ళారా చూస్తున్నామని స్థానికులు ఆనందం వ్యక్తిం చేస్తున్నారు. కాగాఈ కుంట నిర్మాణ పనులు పూర్తికాగానే సెప్టెంబర్ లో సీఎం రేవంత్ చేతుల మీదుగా దీన్ని ప్రారంభించాలని నిర్ణయించినట్లు తెలుస్తుంది

# నలందనగర్‌లో హైడ్రా కూల్చివేతలు

- కాలనీ ప్రతినిధులు ఫిర్యాదుతో రంగంలోకి హైడ్రా
- జెసిబిలను అడ్డుకొని ఆందోళనకు దిగిన స్థానిక మహిళలు
- కూల్చివేతలు అపాలంటూ ఉద్రిక్తత





కూల్చివేత్తలు అపాలంటూ జెసిబి కింద పడుకున్న మహిళ

**అత్తాపూర్ జూలై 8,ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని నలందనగర్‌లో ఆక్రమణలను హైడ్రా మంగళవారం తొలగించింది. ప్రజావసరాలకు ఉద్దేశించిన 1094 గజాల స్థలాన్ని కబ్జాల చేరనుంచి హైడ్రా విడిపించింది. హైదరగూడలో ఏజీ ఆఫీసు కోపరేటివ్ హౌసింగ్ సొసైటీ వాళ్ళు 2001లో నలందనగర్ కాలనీ పేరిట లేఔట్ వేశారు. అప్పట్లో హుడా అనుమతి పొందిన లే ఔట్ యిది. ఇందుకోసం భూమిని అమ్మిన వారే పక్కన ఉన్న వాళ్ల సొంత భూమిలో భాగమని పేర్కొంటూ నలందనగర్ కు చెందిన 1004 గజాల స్థలాన్ని కబ్జా చేసారు. ప్రజావసరాలకు ఉద్దేశించిన మా స్థలం కబ్జా అయ్యిందాంతో నలందనగర్ కాలనీ ప్రతినిధులు హైడ్రాకు ఫిర్యాదు చేసారు. పూర్తి స్థాయిలో సంబంధిత అధికారులతో విచారణ జరిపించిన హైడ్రా 1094 గజాల స్థలం నలందనగర్ కు చెందినదిగా గుర్తించింది. దీంతో మంగళవారం అక్కడ ఉన్న ప్రహరీని.. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షెడ్డు ను తొలగించింది. పార్కు తో పాటు ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలం తమకు దక్కిందని నలందనగర్ కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేశారు.

### హైడ్రా కూల్చివేతలతో నెలకొన్న ఉద్రిక్తత

నలందనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఫిర్యాదుతో హైడ్రా అధికారులు హైదరగూడలో కూల్చివేత్తలు చేపట్టారు.ఈనేపథ్యంలో హైడ్రా అధికారులు కబ్జాకు గురైన స్థలానికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న స్థానికులు. అక్కడికి చేరుకొని అధికారులతో గొడవకు దిగారు.దింతో ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత నెలకొంది.పలువురు మహిళలు కూల్చివేతలు అపాలంటూ జెసిబిలకు అడ్డంగా కూర్చున్నారు.తమపై నుంచి తీసుకెళ్లాలని ఆందోళన వ్యక్తం చేశారు.రాజేంద్ర నగర్ పోలీసులు రంగంలోకి దిగి వారిని అదుపులోకి తీసుకొని కూల్చివేతలు సాగించారు.

# పార్కు సుందరీకరణ పనులు త్వరగా చేపట్టాలి

-జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్



పార్కు మ్యాప్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ ఆర్.వి.కర్ణన్, జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి తదితరులు

**హైదరాబాద్, జూలై 8, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 36లోగల హైకింగ్ ట్రయల్ పార్క్ సుందరీకరణ పనులు త్వరితగతంగా చేపట్టాలని కమీషనర్ ఆర్వి కర్ణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఖైరతాబాద్ జోనల్ కమీషనర్ అనురాగ్ జయంతితో కలిసి కమీషనర్ పార్కును పరిశీలించారు.పార్కు అభివృద్ధి, సుందరీకరణ చేపట్టిన ప్లాన్ లో మార్పులు, చేర్పులు చేయాలని సూచించారు. రోడ్డు నంబర్ 36 నుండి నడుచుకుంటూ వెళ్లి రోడ్ నెంబర్ 25 వరకు మధ్యలో ఉన్న పార్కులు సందర్శించారు. పార్కులో విజిటర్స్‌కు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించే విధంగా అన్ని విధాలుగా సుందరీకరణ, అత్యవసర పనులు చేపట్టి నిర్దేశించిన కాలవ్యవధి లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.కమీషనర్ వెంట ఖైరతాబాద్ జోనల్ కమీషనర్ అనురాగ్ జయంతి, సర్కిల్ 18 ఈఈ విజయకుమార్, హార్టికల్చర్ ఆఫీసర్ బాలయ్యతదితరులు పాల్గొన్నారు.

# రామకృష్ణ మఠంను సందర్శించిన గవర్నర్ దంపతులు



రామకృష్ణ మఠంను సందర్శించిన గవర్నర్ దంపతులు

**ముషీరాబాద్, జూలై 8, ప్రభాతవార్త:** దోమలగూడలోని రామకృష్ణమఠంను తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సతీసమేతంగా సందర్శించారు. మంగళవారం ఉదయం రామకృష్ణ మఠంకు వచ్చిన ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రామకృష్ణ మఠం ప్రాంగణంలో పర్యటించి, అక్కడ మొక్కల పెంపకాన్ని పరిశీలించారు. మఠంలో పెంచుతున్న మొక్కల వివరాలు, మఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలకత్తా బేలూర్ రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి గౌతమానందజీ మహరాజ్‌ను కలసి, ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి బోదమయానందతో పాటు స్వామీజీలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు గుణాత్మక విద్య..నాణ్యమైన ఆహారం అందించాలి

-అధికారులకు జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి ఆదేశం



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన దాసరి

**హైదరాబాద్,జూలై 8,ప్రభాతవార్త:** విద్యార్థులకు గుణాత్మకమైన విద్యతోపాటు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సంబంధిత అధికారులు జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి ఆదేశించారు.మంగళవారం నాంపల్లిలో గల గోషామహల్ గర్ల్స్‌వన్ మైనార్టీ పాఠశాలను అలాగే అనాథ పిల్లల వసతి గృహాన్ని ఆమె సందర్శించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఆదిశగా విద్యాబోధన అందాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థుల బోధనతోపాటు మెనూ ప్రకారం తప్పక ఆహార పదార్థాలను అందించాలని సూచించారు. తరగతి గదులను పరిశీలించి పిల్లలకు అందుతున్న విద్యా బోధనలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు వెనుకంజలో ఉన్న సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. విద్యార్థులకు కంప్యూటర్ ల్యాబ్ ను సద్వినియోగం చేసుకునేలా పెండింగ్ లో ఉన్నటువంటి పనులను సత్వరమే పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని సూచించారు. పాఠశాలలోని విద్యార్థుల ఉత్తీర్ణశాతం నూటికి నూరు శాతం ఉండాలని అలాగే అన్ని తరగతుల పిల్లలకు యూనిఫామ్స్ పుస్తకాలు అందాయని కళాశాల ప్రిన్సిపాల్ ను అడిగి తెలుసుకున్నారు. తదుపరి వంటగదిని పరిశీలించి ఎప్పటికప్పుడు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని అలాగే వంట పాత్రలు, వంటగది శుభ్రతగా ఉంచాలని సూచించారు. అతర్వాత 10వ తరగతి, ఇంటర్ పిల్లలతో మాట్లాడుతూ విద్యతోనే అన్ని అవకాశాలు పొందొచ్చని కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని పాఠశాల, వసతి గృహం అలాగే తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తేవాలన్నారు.అనంతరం వక్ఫ్ బోర్డ్ నిర్వహణలో నడుస్తున్న అనీస్ ఉల్ ఘుర్భా అనాథ ఆశ్రమాన్ని సందర్శించారు.ఈ కార్యక్రమంలో మైనార్టీ సంక్షేమ అధికారి ఇలియాస్ అహ్మద్, తహసిల్దార్ ప్రేమ్ కుమార్, ఆర్‌సిఓ సయ్యద్ తాజుద్దీన్, ప్రిన్సిపాల్ రమాదేవి, అనాథాశ్రమ వార్డెన్ నౌరిన్ బేగం తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలి



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్ కొలను వీరేందర్ రెడ్డి

**నిజాంపేట్, జూలై 8, ప్రభాతవార్త**

సీసీ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మాజీ కార్పొరేటర్ కొలను వీరేందర్ రెడ్డి కాంట్రాక్టర్‌కు, అధికారులకు సూచించారు. 18వ డివిజన్ ఎస్సీ కాలనీలో పెండింగ్లో ఉన్న సిసి రోడ్డును మాజీ కార్పొరేటర్ కొలను వీరేందర్ రెడ్డి చొరవతో కుత్బుల్లాపూర్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలను హనుమంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్డు పనులు నాణ్యత ప్రమాణాలు పాటించాలని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి కాంగ్రెస్ పార్టీ సెక్రెటరీ బాల్ రెడ్డి, డీలర్ శంకర్, షెట్టి జీతయ్య, కోలన్ ప్రశాంత్, విక్రమ్, యూత్ ప్రెసిడెంట్ జీతూ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్సీ కాలనీ పెద్దలు, కమ్మెట పెద్ద నరసింహ, కమ్మెట నారాయణ, కమ్మెట జీతయ్య, కర్రె అశోక్, శివొల్ల బాలేష్, కమ్మెట బలరామ్, కమ్మెట కృష్ణ, యూత్ మెంబర్లు జీతూ, జితేందర్ (సూది) నాని, టిల్లు, ప్రసాద్, వెంకీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రముఖులు రామస్వామి పార్వతీశం విజయకుమార్‌లకు సాహితీ పురస్కారాల ప్రదానం

**నాంపల్లి, జూలై 8 ప్రభాతవార్త :** శాంతా బయోటెక్ వ్యవస్థాపకులు పద్మభూషణ్ డా. కె.ఐ.వరప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతున్న శాంతా వసంతా ట్రస్టు 2025 సంవత్సరానికి రెండవ విడద ప్రతిష్టాత్మక సాహితీ పురస్కారాలను ప్రకటించింది. ప్రముఖ వయోలిన్ విద్వాంసుడు పద్మశ్రీ డా. అన్నవరపు రామస్వామికి వసంత వరప్రసాదరెడ్డి సంగీతరత్న పురస్కారం; ప్రముఖ సాహితీవేత్త డా. ఓలేటి పార్వతీశంకు డా. వరప్రసాదరెడ్డి ఉత్తమ సాహితీవేత్త పురస్కారం; ఎమ్మెస్కో ప్రచురణల అధినేత విజయ్‌కుమార్‌కు కోడూరు వెంకటరమణారెడ్డి సాహితీ సేవారత్న పురస్కారాలకు ఎంపిక చేసినట్లు ఆ పత్రికా ప్రకటనలో తెలిపారు. ప్రముఖ అతిథుల చేతులమీదుగా 20వ తేదీ ఆదివారం ఉదయం 10గంటల నుండి బొగ్గులకుంట తెలంగాణ సారస్వత పరిషత్తులోని డా. దేవులపల్లి రామానుజరావు కళావేదికలో పురస్కార గ్రహీతలకు ఆయా పురస్కారంతోపాటు ఒక్కొక్కరికి లక్షరూపాయల నగదు, శాలువా, ప్రశంసాపత్రంతో ఘనంగా సత్కరిస్తామని ట్రస్టు కార్యవర్గం వెల్లడించింది.

## శ్రీ కట్టమైసమ్మ ఆలయం వద్ద అన్నదానం



భక్తులకు అన్నవితరణ చేస్తున్న వివేక్‌రెడ్డి

**పేట్ బషీరాబాద్, జూలై 8, ప్రభాతవార్త**

జీడిమెట్ల డివిజన్ పరిధిలోని శ్రీ కట్టమైసమ్మ ఆలయం వద్ద మంగళవారం అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధి వివేక్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా సుమారు 500 మంది పేదలకు అన్నదానం చేశారు. అంతకుముందు కట్టమైసమ్మకు ప్రత్యేక పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. ప్రతి మంగళవారంతో పాటు అమావాస్య రోజు ఇక్కడ అన్నదానం చేస్తూవస్తున్నారు.

## వైభవంగా శ్రీ విఠలేశ్వర స్వామి వారి పల్లకి శోభా యాత్ర



శ్రీ విఠలేశ్వర స్వామి ఆషాడ త్రిరాత్రి ఏకాదశి ఉత్సవాలలో పాల్గొన్న జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

**చార్మినార్, జూలై 8 ప్రభాతవార్త :**

పాతబస్తీ పురానాపూల్ గల్బవీధిలోని శ్రీ విఠలేశ్వర స్వామి దేవాలయంలో ఆషాడ త్రిరాత్రి ఏకాదశి మహోత్సలు వైభవంగా ముగిసాయి. ఆషాడ త్రిరాత్రి ఏకాదశి ఉత్సవాలు సందర్భంగా మందిరంలో శ్రీ రుక్మిణి సమేత విఠలేశ్వర స్వామి కళ్యాణం ఘనంగా జరిగింది. జాగృతిఅధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శ్రీ రుక్మిణి సమేత విఠలేశ్వర స్వామి కళ్యాణంలో పాల్గొని పూజలు నిర్వహించారు. మందిరం కమిటి చైర్మన్, హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బిఆర్ఎస్ కంటెస్టెడ్ ఎంపి పుస్తె శ్రీ కాంత్ ఎమ్మెల్సీ కవితను శాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, పాతబస్తీ ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి చైర్మన్ జి.రాఘవేందర్, బిజెపి నాయకులు వాసు, మీరాలం మండి శ్రీ మహంకాళేశ్వర మందిరం కమిటి చైర్మన్ గాజుల అంజయ్య, సుల్తాన్ షామి శ్రీ జగదాంబ మందిరం కమిటి చైర్మన్ రాకేష్ తివారీ, పాతన గరం మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు ఆకుల శ్రీ రాములు , తిరుపతి శివ కుమార్, మందిరం కమిటి అధ్యక్షులు టి.రంజిత్ సింగ్, టి.రాజేందర్, విష్ణు గౌడ్, సందీప్, పవన్ రెడ్డిలు పాల్గొన్నారు. కాగా సోమవారం సాయంత్రం పాతబస్తీలోని పలు ప్రాంతాలలో అత్యంత వైభవంగా శ్రీ విఠలేశ్వర స్వామి వారి పల్లకి శోభాయాత్ర వైభవంగా జరిగింది.

## బహదూర్‌పుర నియోజకవర్గం ప్రజలకు రేషన్ కార్డులు మంజూరు చేయాలి



చార్మినార్ సర్కిల్ -3 ఏఎస్‌ఓకు వినతి అందజేస్తున్న బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్

**యాకుత్‌పుర, జూలై 8 ప్రభాతవార్త :** రేషన్ కార్డులు కోసం ధరఖాస్తులు చేసుకున్న బహదూర్‌పుర నియోజకవర్గం ప్రజల ధరఖాస్తులను విచారణ పూర్తి చేసి లబ్ది దారులకు కొత్త రేషన్ కారులు మంజారు చేయాలని కోరుతూ బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు కలిసి చార్మినార్ సర్కిల్ 3 ఏఎస్ఓ అస్లాంఖాన్‌కు వినతి పత్రం అందజేశారు. వీలైనంత త్వరగా ధరఖాస్తులను విచారణ జరిపి రేషన్ కార్డులుమంజారు చేస్తామని సర్కిల్ ఏఎస్ఓ అస్లాం ఖాన్ హామి ఇచ్చారని రాజేష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మీర్ మహమూద్ అలీ, జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

## ఆలయ కమిటీలో ఖాళీగా ఉన్న పోస్టులను కాలనీ వాసులకు కేటాయించాలి

-దేవాలయంలో ఏకపక్షంగా వ్యవహరిస్తున్న స్థానికేతరులపై అధికారులకు ఫిర్యాదు చేస్తాం

-ఎస్‌బిఐ స్టాఫ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ ,ఎస్‌బిఐ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యనిర్వాహక సభ్యుల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌బిఐ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

**ముషీరాబాద్, జూలై 8, ప్రభాతవార్త:** కవాడిగూడ ఎస్‌బీఐ కాలనీలో ఉన్న శిరిడి సాయిబాబా ఆలయ కమిటీలో ఖాళీగా ఉన్న రెండు పోస్టులను ఎస్‌బీఐ కాలనీ సొసైటీ సభ్యులకు కేటాయించాలని ఎస్‌బీఐ స్టాఫ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ మరియు ఎస్‌బీఐ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యనిర్వాహక సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 1991వ సంవత్సరంలో ఎస్‌బీఐ స్టాఫ్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో స్థలం కొనుగోలుచేసి, కాలనీ వాసుల సహకారంతో సాయిబాబా మందిరాన్ని నిర్మాణం చేయటం జరిగిందని తెలిపారు. దేవాలయం నిర్మాణ సమయంలో కాలనీ సభ్యులు రామారావుకు ఆలయ బాధ్యతలు అప్పగించి, ఆలయ కమిటీ ట్రస్టీ సభ్యులుగా నలుగురిని నియమించటం జరిగిందని పేర్కొన్నారు. కాలక్రమేణా కమిటీ సభ్యులలో ఇద్దరు మరణించారని, వారి స్థానంలో స్థానిక కాలనీ వాసులను చేర్చుకోవాలని కోరితూ ఉంటే, స్థానికేతరులు కొందరు దేవాలయంలో పెత్తనం చెలాయిస్తూ, తాము దాతలం అంటూ ఏం చేసినా చెల్లుతుందన్నట్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఆలయ నిర్వహణ బాద్యత చూస్తున్న రామారావు కూడా ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ఉన్నారని, ఇటువంటి సమయంలో వ్యవస్థాపకులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా దేవాలయంలో నిర్మాణాలు చేపడుతున్నారని ధ్వజమెత్తారు. ఆలయ నిర్మాణ సమయంలో కాలనీలోని ప్రతి ఇంటి భాగస్వామ్యం ఉందని, ఇప్పుడు స్థానికేతరులు వచ్చి, పెత్తనం చెలాయిస్తూ, ఎన్నిసార్లు చెప్పినా ఖాళీగా ఉన్న పోస్టులను సొసైటీ సభ్యులకు ఇవ్వకుండా, ఏకపక్షంగా వ్యవహరిస్తూ ఆలయాన్ని తమ ఆధీనంలోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా వారు స్పందించి, ఖాళీగా ఉన్న పోస్టులను సొసైటీ సభ్యులతో భర్తీ చేయాలని, లేనిపక్షం ఏకపక్షంగా వారు చేస్తున్న నిర్మాణాలపై అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్‌బీఐ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి కే.చంద్రశేఖర్, సలహాదారులు టి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు ఏ.సరళ, ఏ.శంకర్ గౌడ్, కోశాధికారి కే.లక్ష్మణ్, జాయింట్ సెక్రటరీ ఉమానాథ శర్మ, కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, టి.రమ, సుందరి తదితరులు పాల్గొన్నారు.

## వివిధరంగాల్లోని ప్రముఖులకు తెలుగు విశ్వవిద్యాలయ ప్రతిభ పురస్కారాలు : రిజిస్ట్రార్ ఆచార్య హనుమంతరావు

**నాంపల్లి, జూలై 8 ప్రభాతవార్త :** సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం వివిధరంగాల్లో విశేష కృషిచేసిన 12మంది ప్రముఖులను ప్రతిభ పురస్కారాలతో సత్కరిస్తున్నట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు తెలిపారు. 2024 సంవత్సరానికిగాను విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారాలను వివిధ ప్రక్రియల్లో ప్రకటించింది. వారిలో డా. యాకూబ్ (కవిత); డా. ఎం. శ్రీనివాసన్ (పరిశోధన); ఎల్.నరేందర్ (చిత్రలేఖనం); బైరోజు చంద్రశేఖర్ (శిల్పం); ఆర్.ప్రసన్నరాణి (నృత్యం); డా. బి.రాధా సారంగపాణి (సంగీతం); కె.కైలాస్ (పత్రికారంగం); దుప్పెల్లి శ్రీరాములు (నాటకం); గజ్వెల్లి సమ్మయ్య (జానపద కళారంగం); ఆముదాల మురళి (అవధానం); డా. పులిగడ్డ విజయలక్ష్మి (ఉత్తమ రచయిత్రి); పోల్కంపల్లి శాంతాదేవి (నవల/కథ) పురస్కారాలకు ఎంపికయ్యారని తెలియజేశారు. 19 శనివారం సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లో జరిగే ప్రత్యేక ఉత్సవంలో తెలంగాణ రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గడ్డం వివేక్ ముఖ్యఅతిథిగా పాల్గొని పురస్కారాలను ప్రదానం చేస్తారని, పురస్కారం కింద ఒక్కొక్కరికి 20,116 రూపాయల నగదు అందజేసి ఘనంగా సత్కరిస్తామని రిజిస్ట్రార్ వెల్లడించారు.

## ప్రజలు కలిసి మెలిసి ఉత్సవాలు జరుపుకుంటున్నారు



కార్యక్రమంలో పాల్గొన్న కిషన్‌బాగ్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు సాయి కిరణ్

**చార్మినార్, జూలై 8 ప్రభాతవార్త :**

ప్రజలు కలిసి మెలిసి ఉత్సవాలను జరుపుకుంటున్నారని కిషన్‌బాగ్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు సాయి కిరణ్ అన్నారు. మొహర్రం సందర్భంగా చిట్యాలలోని ఆలంకు ఆయన పూలు దట్టీలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు పండుగలను ఐకమత్యంతో జరుపుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో పలువురు టిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం :ఎమ్మెల్యే శ్రీగణేష్



ప్రజా వాణిలో సమస్యలు తెలుసుకుంటున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్, జూలై 8 ప్రభాతవార్త:** ప్రజా సమస్యల పరిష్కారమే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయమని కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. మంగళవారం టీపీసీసీ ఆధ్వర్యంలో గాంధీ భవన్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన పాల్గొని ప్రజల నుంచి వచ్చి వినతిపత్రాలను స్వీకరించి వారి సమస్యలను తెలుసుకొని ఎప్పటికప్పుడు పరిష్కారం అయ్యే విధంగా సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

### కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు తక్షణమే నిర్వహించాలి : కేశవరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు ససదాకేశవరెడ్డి తదితరులు

**కంటోన్మెంట్, జూలై 8 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు తక్షణమే నిర్వహించాలని బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు ససదాకేశవరెడ్డి తెలిపారు. మంగళవారం తాడ్‌బండ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2020 నుంచి బోర్డు ఎన్నికలు నిర్వహించకపోవడంతో స్థానిక సమస్యలు కుంటుపడుతున్నాయన్నారు. బోర్డు ఎన్నికలు తక్షణమే నిర్వహించాలని హై కోర్టును ఆశ్రయించినట్లు ఆయన తెలిపారు. బోర్డు పాలక మండలి ముగిసి నాలుగున్నర సంవత్సరాలు పూర్తైన ఎన్నికలు నిర్వహించకపోవడం సరైంది కాదన్నారు భారత రాజ్యాంగం ప్రకారం ప్రతి 5 సంవత్సరాలకు ఎన్నికలు నిర్వహించాలన్నారు. కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు నిర్వహించాలని ప్రధాని నరేంద్ర మోదీ, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు, ఎంపీ ఈటెల రాజేందర్‌లకు కూడా విజ్ఞప్తి చేసినట్లు అయన తెలిపారు.



ఒక్కనిమిషం డ్రైవింగ్‌లో తొందరపాటు ఆదమరిస్తే అదే జీవితానికి గ్రహపాటు

-ఫోటోజర్నలిస్టు..

## బసవతారక నగర్ బాధితులకు అండగా ఉంటాం : జాన్ వెస్లీ



బసవతారక నగర్‌లో పర్యటిస్తున్న జాన్ వెస్లీ బృందం

**గచ్చిబౌలి, జూలై 8, ప్రభాతవార్త**

గచ్చిబౌలి డివిజన్ గౌలిదొడ్డి బసవతారక నగర్ బాధితులకు ప్రభుత్వం న్యాయం చేయాలని, ప్రభుత్వ భూముల్లో ఉన్న పేదలకు న్యాయం చేస్తామని గతంలో సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని మరచి అదే పేదలను ప్రభుత్వ భూముల్లో నుండి ఖాళీ చేయించడం దుర్మార్గమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. మంగళవారం బసవతారక నగర్ భూ బాధితులను సీపీఎం నాయకులతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా స్థానికులను అడిగి విషయం తెలుసుకున్నారు. ప్రభుత్వ భూమిలో గత 40 సంవర్సాలుగా బసవతారక నగర్‌లో ఉంటున్నామని, మా పెద్దలు అంతా ఇక్కడే ఉన్నారని, మేమంతా ఇక్కడే పుట్టామని ఇక్కడే చస్తామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. గుండాలతో తమను ఖాళీ చేయించాలని, వెళ్లకపోతే చంపేస్తామని దాడులు చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2021లో కూడా ఖాళీ చేయించాలని మాపై దాడులకు తెగబడ్డారని, ఇప్పుడు మరోసారి ఖాళీ చేయిస్తున్నారని, తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ.. దొంగలు దొంగలు కలిసి ఊర్లు పంచుకున్న తీరుగా ప్రభుత్వం, నాయకులు, రెవెన్యూ అధికారులు కలిసి ప్రభుత్వ భూములను కొల్లగొడుతున్నారని, ప్రభుత్వ భూముల్లో ఉన్న పేదలను ఖాళీ చేయిస్తున్నారని అన్నారు. గరీబోళ్ల కోసమే, పేదలకోసమే ఎర్ర జెండా పార్టీ పుట్టిందని, బసవతారక నగర్ బస్తీ వాసుల కోసం సీపీఎం పార్టీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి బసవతారక నగర్‌లోని పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టించాలని, ఒక్కరు కూడా ఇక్కడి నుండి కదలరని, వారికి న్యాయం చేయాలని జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి యాదయ్య, చల్లా శోభన్, కొంగరి కృష్ణ, జగదీశ్వర్, ఇతర సీపీఎం నాయకులు, పాల్గొన్నారు.

### ఫ్లెక్సీ కడుతూ విద్యుత్ షాక్ గురై వ్యక్తి మృతి

**మూసాపేట్, జూలై 8, ప్రభాతవార్త**

గురు పౌర్ణమి సందర్భంగా సాయిబాబా ఆలయానికి సంబంధించిన ఫ్లెక్సీ కడుతూ ఆటో డ్రైవర్ విద్యుత్ షాక్ గురై మృతి చెందిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని భాగ్యనగర్ కాలనీలో చోటు చేసుకుంది. స్థానికంగా ఉండే ఆటోడ్రైవర్ జ్ఞానేశ్వర్ సాయిబాబా ఆలయానికి సంబంధించిన ఫ్లెక్సీ కట్టేందుకు భాగ్యనగర్ కాలనీ కమాన్ పైకి ఎక్కి ఫ్లెక్సీ కడుతుండగా సమీపంలో ఉన్న హైటెన్షన్ లైన్ విద్యుత్ తీగ తగిలి విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహం కమాన్ పైనే వేలాడుతుండడంతో విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. అగ్నిమాపక శాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కిందకు దించారు.

### బంజారాహిల్స్ పీఎస్ ఎదుట ఎంఆర్‌పిఎస్ నిరసన..

**పంజగుట్ట, జూలై 8 (ప్రభాతవార్త):**

మేయర్ విజయలక్ష్మి ఆదేశాల మేరకు తమపై అక్రమంగా హత్యాయత్నం కేసునమోదు చేశారని ఆరోపస్తూ మంగళవారం యంఆర్‌పీఎస్ నాయకులు ఆందోళనకు దిగారు. బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన యంఆర్‌పీఎస్ గద్దెనను మేయర్ గద్వాల విజయలక్ష్మి ఆదేశాల మేరకు కూల్చివేశారని వారు ఆరోపించారు. ఈ విషయమై ప్రశ్నించినందుకు మేయర్ ఫిర్యాదు మేరకు తమపై అక్రమంగా హత్యాయత్నం కేసునమోదు చేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ సామాజికవర్గంపై మేయర్ విజయలక్ష్మి వివక్ష చూపుతున్నారని తమకు న్యాయం చేయాలని యంఆర్‌పీఎస్ నాయకులు నరశింహ డిమాండ్ చేశారు. ఈ విషయమై విచారణ జరుపుతామని పోలీసులు హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు,

### కారు పార్కింగ్ విషయంలో స్వల్ప వివాదం..

**పంజగుట్ట, జూలై 8 (ప్రభాతవార్త):**

మంగళవారం వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా పంజగుట్టలో పోలీసులకు, కాంగ్రెస్ నేతలకు స్వల్ప వివాదం చోటు చేసుకుంది. వివరాలలోకళితే వైఎస్ఆర్ జయంతి సందర్భంగా పంజగుట్టలోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులు అర్పించేందుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్, ఇతర మంత్రులు, సీనియర్ నేతలు, స్థానిక కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి తీవ్రంగా కష్టపడ్డారు. ఈ సమయంలో ఓ నేత కారును అక్కడ పార్క్ చేయడంతో ట్రాఫిక్ పోలీసులు కారును అక్కడ నుండి తొలగించాలని కోరారు. కానీ ఆ కారు డ్రైవర్ నసేమిరా అని అక్కడ నుండి కారు తీయకపోగా తమ కారే తాయమంటారా తమ సార్ ఎవరో తెలుసా అంటూ పోలీసులనే ఎదురు ప్రశ్నించారు. దీంతో కొందరు అక్కడకు చేరుకోవడంతో స్వల్ప వాగ్వివాదం చోటు చేసుకుందా. సీనియర్ పోలీసు అధికారులు అక్కడకు చేరుకుని గొడవపెద్దది కాకుండా సర్దిచెప్పారు.

## కూకట్‌పల్లి అభివృద్ధి కోసం శాయశక్తుల కృషి : బండి రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న బండి రమేష్

**కెపిహెచ్బి కాలనీ, జూలై 8, ప్రభాతవార్త**

కూకట్పల్లి నియోజకవర్గం అభివృద్ధి కోసం శాయశక్తుల కృషి చేస్తున్నట్లు కూకట్పల్లి కాంగ్రెస్పార్టీ ఇంచార్జి, టిపిసిసీ ఉపాధ్యక్షులు బండిరమేష్ అన్నారు. సోమవారం మూసాపేట ఆంజనేయనగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి ప్రజలు ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం సీఎం దృష్టికి, ప్రభుత్వ పెద్దలు, అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా కూకట్పల్లి జేఎన్టీయు రోడ్డు, గోద్రేజ్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకుని అండర్ గ్రౌండ్ బైస్ వంతెనతోపాటు స్కైవేలను ఏర్పాటు చేయాలని, జేఎన్టీయూ నుంచి హైటెక్ సిటీ వరకు 6 కిలోమీటర్ల వరకు మెట్రో రైల్ లేక లైట్ రైల్ నిర్మాణం చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డికి ప్రతిపాదిస్తూ లేఖ రాయడం జరిగిదని చెప్పారు. అదేవిధంగా కేపీహెచ్బి కాలనీ 5వ ఫేజ్ వద్ద గత ప్రభుత్వ హయాంలో గుర్తించి శంకుస్తావన చేసిన స్థలంలో వంద వడకల ఆసుపత్రి నిర్మాణానికి నిధులను మంజూరు చేసి, పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వ వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలని సీఎంను కోరినట్లు బండి రమేష్ తెలిపారు. ఖైత్లాపూర్ వద్ద నిర్మించి సిద్ధంగా ఉన్న 144 డబుల్ బెడ్రూం ఇళ్ళను అర్హులైన పేదలకు అందించాలని, ప్రభుత్వం కేపీహెచ్బి ఫోర్త్ ఫేజ్ వద్ద ఉన్న ఆర్టీఏ కార్యాలయం ఇరుకు రోడ్డులో ఉన్నందున స్థానికులతోపాటు వాహన దారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న దృష్ట్యా కార్యాలయానికి ప్రభుత్వం స్థలం కేటాయించి ఇక్కడి నుంచి ప్రస్తుత కార్యాలయాన్ని తరలించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున సమస్యలను పరిష్కరించడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేస్తున్నారని, ఇంకా ఏమైనా సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే సీఎం, మంత్రులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ కాంగ్రెస్థాన కార్యదర్శి కొప్పిశెట్టి దినేష్ కుమార్, సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, మాజీ వైస్ చైర్మన్ ఎం. లక్ష్మయ్య, గంధం రాజు, అరవింద్ర రెడ్డి, పిడికిటి గోపాల్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

### తెలుగుజాతి వారసత్వ కళాసంపద పద్యనాటకాలు



**రవీంద్రభారతి, జూలై 8 ప్రభాతవార్త :** పద్యనాటకాలు ముఖ్యంగా పౌరాణిక పద్యనాటకాలు అనాదికాలంగా తెలుగుజాతికి వారసత్వం వస్తున్న కళాసంపదని దానిని కాపాడుకోవడం, ప్రోత్సహించడం, భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని ప్రముఖ పౌరాటిక నటుడు కుందుర్తి వెంకటకృష్ణ అన్నారు. ప్రముఖ సాంస్కృతిక సంస్థ శివాని ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళావేదికలో పౌరాణిక శ్రీకృష్ణరాయబారం పూర్తి నాటకం, శ్రీ సత్య హరిశ్చంద్రీయములో శ్మశాన ఘట్టము పద్యనాటకము అద్భుతంగా ప్రదర్శింపబడి ఆహుతులను తన్మయుల్ని చేసి ప్రశంసలందుకున్నాయి. ఈ సందర్భంగా మొవ్వ దేవనాథసూరి సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కుందుర్తి వెంకటకృష్ణ విశిష్ట అతిథులు డా. రాజగోపాల్, తడకమళ్ళ రామచందర్‌రావు, సుధాకర్, హరిప్రసాద్, టి.కృష్ణ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బపనిపల్లి పరమేశ్వర్ తదితరులతో కలిసి జ్యోతి ప్రకాసనంచేసి పరమేశ్వర్ రంగస్థలరంగాన్ని విశేషంగా ప్రోత్సహిస్తూ పౌరాణిక పద్యనాటకాలను కాపాడుతూ భావితరాలకు అందిస్తుండడం శ్లాఘనీయమని ఆయన కళాసేవను కొనియాడారు. అనంతరం పలువురు ప్రముఖ కళాకారులను ఘనంగా సత్కరించడంతోపాటు ప్రఖ్యాత కళాకారిణి సాదా వీరమణిని ఘనంగా సన్మానించి స్వర్ణకంకణ ధారణ కావించి శుభాభినందనలు తెలిపారు.

## కల్తీకల్లు తాగి అస్వస్థకు గురైన 11మంది బాధితులు

**కెపిహెచ్‌బి కాలనీ, జూలై 8, ప్రభాతవార్త :**

కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని హైదర్ నగర్‌లో కల్తీ కల్లు తాగి దాదాపు 11 మంది అస్వస్థత గురి అయ్యారు. అస్వస్థకు గురైన బాధితులను కూకట్‌పల్లిలోని నిరాందేవ్ రావ్ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్చారు. ఈ సందర్భంగా రాందేవ్ రావ్ ఆసుపత్రిలో అస్వస్థకు గురై చికిత్స పొందుతున్న బాధితుల నుంచి సమాచబాలానగర్ జోన్ డిసిపి సురేష్ కుమార్, కూకట్ పల్లి ఏసిపి కిరణ్‌లు సమాచారం అడిగి తెలుసుకున్నారు. సంఘటనకు సంబంధించి వివరాలు తెలుసుకోవడానికి ఎక్సైజ్ డిపార్ట్మెంట్, మెడికల్ డిపార్ట్మెంట్ ప్రతినిధులు ఆసుపత్రికి చేరుకున్నారు.

## తాగి న్యూసెన్స్ చేసిన ముగ్గురికి నాలుగు రోజులు జైలుశిక్ష

**బేగంపేట జూలై 8, ప్రభాతవార్త**

తాగి న్యూసెన్స్ చేసిన కేసులో ముగ్గురు నిందితులకు ఒక్కొక్కరికి నాలుగు రోజుల పాటు జైలుశిక్ష ను విధిస్తూ 16వ స్పెషల్ మెట్రో పాలిటన్ మేజిస్ట్రేట్ ఏ.వెంకటేశ్వర్లు తీర్పునిచ్చినట్లు బేగంపేట ఇన్స్పెక్టర్ బి.ప్రసాదరావు తెలియజేసారు. తాగి న్యూసెన్స్ చేసిన పాటిగడ్డ ఎన్ బి టీ నగర్ కు చెందిన ఎండి సల్మాన్(21), ఎండీ సల్మాన్ (24), మొహసిన్(25)వీరంతా తాగి న్యూసెన్స్ చేస్తుండటంతో వీరిపై ఎస్సై శ్రీధర్ కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చగా నిందితులకు న్యాయమూర్తి ఒక్కొక్కరికీ నాలుగు రోజుల పాటు జైలు శిక్ష విధించినట్లు ఇన్స్పెక్టర్ బి.ప్రసాదరావు తెలియజేసారు.

## కుటుంబీకుల మధ్య జరిగిన వివాదంలో వృద్ధురాలు మృతి

**చార్మినార్, జూలై 8 ప్రభాతవార్త :** కుటుంబీకుల మధ్య జరిగిన తోపులాటలో నెట్టి వేయటంతో ఓ వృద్ధురాలు (65) మృతి చెందిన పాతబస్తీ బహదూర్‌పుర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.... కిషన్‌బాగ్‌లోని అసద్‌బాబా నగర్‌కు చెందిన మహ్మద్‌కు భార్య పిల్లలు ఉన్నారు. మూడునెలలు క్రితం మహ్మద్ షెహజాదిని రెండవ వివాహం చేసుకున్నాడు. వివాహం జరిగినప్పటి నుంచి మొదటి భార్య అప్రోస్ బేగం, రెండవ భార్య షెహజాదిల కుటుంబాల మధ్య గొడవలు జరుగతున్నాయి. కాగా ఈ నెల 7వ తేదీ సోమవారం రాత్రి 11.45 గంటల సమయంలో రెండు కుటుంబాల మధ్య వివాదం జరిగింది. వివాదాన్ని అడ్డుకోవటానికి వచ్చిన మొదటి భార్య అప్రోస్ బేగం తల్లి మహమూద్‌బీని రెండవ భార్య షెహజాది చెల్లి సమీన్ బేగం, తల్లి అమీన్ బేగంలు కలిసి నెట్టి వేశారు. ఈ సంఘటనలో మహమూద్ బికి హై బిపి ఉండటంతో ముక్కు నుంచి రక్తం కారి మృతి చెందింది. ఈ కేసును బహదూర్‌పుర పోలీసులు అన్ని కోణాలు నుంచి దర్యాప్తు చేస్తున్నారు.

### సమగ్ర సాంస్కృతిక విధానం లేకుండా తెలంగాణ అభివృద్ధా..?

-విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్

**చిక్కడపల్లి, జూలై 8 ప్రభాతవార్త:** సంస్కృతిని నిర్మించేది శాస్త్రజ్ఞుడు, కళాకారుడు, శ్రామికుడు ముగ్గురు వ్యక్తులు అని, కళాకారులు అంటే భావాలను బట్వాడా చేసేవాడని, "బల ప్రయోగంతో ఎవరూ కూడా జయించలేదని, భావాలతో మాత్రమే ప్రపంచాన్ని జయించగలరు" ఇది ప్రభుత్వాలు గుర్తెరిగి ముందుకు సాగాలని, ఇందుకుగాను తెలంగాణ లో సమగ్ర సాంస్కృతిక విధానం తేవాలని విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అభిప్రాయపడ్డారు. మంగళవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జి రాములు అధ్యక్షత వహించారు. తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం ఆధ్వర్యంలో తెలంగాణ సమగ్ర సాంస్కృతిక విధానం పై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జస్టిస్ చంద్ర కుమార్ మాట్లాడుతూ తెలంగాణ పోరాట గడ్డపై విష సంస్కృతి విలయతాండవం చేస్తుంది దీనికి పిల్లల నుండి పెద్దల వరకూ బానిసలవుతున్నారు దీనికి బాధ్యులు ఎవరు? కాషాయం ,కార్పొరేట్ కలిసిపోతున్నారు ఈసమయం లో పురోగమన భావాలు ఎవ్వరూ ప్రచారం చేయ్యాలి మానవీయ విలువలు బోధించాలి ప్రభుత్వాలు తక్షణ మే కళాకారులతో ప్రచార యాత్రల ను చేపట్టాలని, తెలంగాణలో పలు అకాడమీలు తక్షణమే ఏర్పాటు చేసి ప్రత్యేక అధికారి ప్రత్యేక నిధులు విధులు సమకూర్చాలని డిమాండ్ చేశారు.


PUBLIC NOTICE

The General Public is hereby informed that my client M/s. Unity Small Finance Bank Limited decided to grant loan to M/s. Sri YKS Function Hall Enterprises represented by its Proprietor Gouni Aravind Goud, S/o Krishnaiah, aged about 45 years, Occ: Business, R/O H. No.1-76, Madgul, Ranga Reddy District, on his approaching my client claiming as the owner of below mentioned schedule of property the then agriculture in nature registered as Gift Deed Doc. No. 29/2021 executed and registered by his father Gouni Krishnaiah on 06.01.2021 before Tahsildar and Joint Sub Registrar, Madgul under Dharani Portal. Gouni Aravind Goud (as per document Gouni Aravind) converted the land to non agriculture use as per NALA Order dated 02.06.2022 vide Proceedings No. 2200554121 and proceedings No. 2200436152 dated 28.04.2022. Later on obtained permission dated 29.10.2022 issued by Panachayat Secretary, Madgul Grampanchayat and constructed house.

Any person/s, Financial Institutions, Banks having right, title, objections or claims in respect of the schedule of property shall submit their claims within 7 days from the date of publication to the undersigned along with documentary evidence and no claims shall be entertained thereafter.

SCHEDULE OF PROPERTY

All that piece and parcel of open land bearing Sy.No.588/A1/1, admeasuring Ac.2-00 Gts or 9680.0 Sq. Yds and open land bearing Sy.No.588/A1/1/1 admeasuring Ac.0-05 Gts or 605.0 Sq.Yds. total admeasuring 10,285.0 Sq.Yds situated at Madgul Village & Mandal, Ranga Reddy District, and bounded by:
NORTH : Agriculture land of Gouni Prakash;
SOUTH : Agriculture land of Gouni Prakash;
EAST : Road; WEST : Agriculture land of Kamoji Krishnaiah & others;

Sd/- Dr. C.S. CHAKRAVARTHY
Ph.D. (Law)
ADVOCATE
Ground Floor, H.No.16-11-16/T/4, "Master's Nilayam", West Prashanth Nagar, Moosarambagh, Hyderabad – 500 036.
Phone: 9391046708, 7901240898



LOSS OF DOCUMENTS

I, Mumtaz Begum W/O Late Mohammed Abdul Rahman R/O 16-2-741/D/47, Asmangadh, T.V Tower, Malakpet, Hyd. On 27/06/2025, I have lost my Bank Pass Book, Aadhar Card & Original Sale Deed Bearing Document No: 3812/1983 of my above said house While I was travelling from Asmangadh to Nalgonda X-Road. If anyone found Contact +91 77805 81615



IN THE COURT OF THE HON'BLE III ADDITIONAL DISTRICT JUDGE: RANGA REDDY DISTRICT AT L.B.NAGAR
O.S.NO. 282 OF 2020

Between:
Smt. Baddam Bujjamma & others ..Plaintiffs
And
Baddam Raj Shekar Reddy & others ..Defendants

To
(D-5) Smt. Puntikura Ranganayakamma, W/o. Vishnuvardhan Reddy, Aged about 44 years, Occupation: Housewife, R/o. H.No. 3-5, Sanghi Nagar, Hayath Nagar Mandal, Ranga Reddy District.

That the plaintiffs have filed the above suit against you and others for partition and separate possession in respect of the suit schedule property and the above suit is posted on 29-07-2025 for your appearance.

Therefore you are hereby required to appear before the said Court on 29-07-2025 at 10:30 AM either personally or through an Advocate, otherwise the matter will be decided exparte.

SUIT SCHEDULE PROPERTY

All that agricultural lands in Sy No. 1, adm. Ac. 5-29 gts, Sy No. 2 adm. Ac. 1-06 Gts, Sy No. 4 adm. Ac. 0-04 gts, Sy No. 8 adm. Ac. 1-20 gts, Sy No. 9 adm. Ac. 1-14 gts, Sy No. 10 adm. Ac. 2-08 gts, Sy No. 11 adm. Ac. 2-02 gts, Sy No. 12 adm. Ac. 1-09 gts, Sy No. 13 adm. Ac. 2-00 Gts, Sy No. 14 adm. Ac. 1-23 gts, Sy No. 15 adm. Ac. 4-08 gts, Sy No. 24 adm. Ac. 3-17 gts, Sy No. 26 adm. Ac. 1-25 gts, Sy No. 27 adm. Ac. 0-15 gts, Sy No. 197 adm. Ac. 0-09 gts, Sy No. 256/A adm. Ac. 0-33 gts, Sy No. 271 adm. Ac. 2-05 gts, Sy No. 274 adm. Ac. 2-04 gts, Sy No. 281 adm. Ac. 1-37 gts, Sy No. 286 adm. Ac. 0-35 gts, total admeasuring Ac. 36-23 guntas, situated MUCHINTAL VILLAGE, Shamshabad Mandal, Ranga Reddy District, bounded by:- NORTH : Land of B. Narsimlu & others. SOUTH : Road leads to Muchintal to Palmakul. EAST: Village Gramakantam. WEST : Land of My Homes (P) Ltd.

BY ORDER OF THE COURT
Sd/- M/S.G.Sudhakar Reddy
Advocate
Plot No.131, Sai Ram Nagar Colony, Champapet, Hyderabad.
Ph: 9848470673
Counsel for the Plaintiffs



IN THE COURT OF THE HON'BLE III ADDITIONAL DISTRICT JUDGE: RANGA REDDY DISTRICT AT L.B.NAGAR
I.A.NO. 443 OF 2020
IN
O.S.NO. 282 OF 2020

Between:
Smt. Baddam Bujjamma & others ..Petitioners/Plaintiffs
And
Baddam Raj Shekar Reddy & others ..Respondents/Defendants

To
(D-5) Smt.Puntikura Ranganayakamma, W/o Vishnuvardhan Reddy, Aged about 44 years, Occupation: Housewife, R/o. H.No. 3-5, Sanghi Nagar, Hayath Nagar Mandal, Ranga Reddy District.

That the petitioners have filed the above suit against you and others for partition and separate possession in respect of the suit schedule property. Wherein the above I.A.No. 443 of 2020 was filed for granting ad-interim injunction order by restraining you and other respondents from alienating the suit schedule property to the third parties pending disposal of the main suit and now the above I.A is posted on 29-07-2025 for your appearance.

Hence, you are hereby required to appear before the said Court on 29-07-2025 at 10:30 AM either personally or through an Advocate, otherwise the matter will be decided exparte.

SUIT SCHEDULE PROPERTY

All that agricultural lands in Sy No. 1, adm. Ac. 5-29 gts, Sy No. 2 adm. Ac. 1-06 Gts, Sy No. 4 adm. Ac. 0-04 gts, Sy No. 8 adm. Ac. 1-20 gts, Sy No. 9 adm. Ac. 1-14 gts, Sy No. 10 adm. Ac. 2-08 gts, Sy No. 11 adm. Ac. 2-02 gts, Sy No. 12 adm. Ac. 1-09 gts, Sy No. 13 adm. Ac. 2-00 Gts, Sy No. 14 adm. Ac. 1-23 gts, Sy No. 15 adm. Ac. 4-08 gts, Sy No. 24 adm. Ac. 3-17 gts, Sy No. 26 adm. Ac. 1-25 gts, Sy No. 27 adm. Ac. 0-15 gts, Sy No. 197 adm. Ac. 0-09 gts, Sy No. 256/A adm. Ac. 0-33 gts, Sy No. 271 adm. Ac. 2-05 gts, Sy No. 274 adm. Ac. 2-04 gts, Sy No. 281 adm. Ac. 1-37 gts, Sy No. 286 adm. Ac. 0-35 gts, total admeasuring Ac. 36-23 guntas, situated MUCHINTAL VILLAGE, Shamshabad Mandal, Ranga Reddy District, bounded by:- NORTH : Land of B. Narsimlu & others. SOUTH : Road leads to Muchintal to Palmakul. EAST : Village Gramakantam. WEST : Land of My Homes (P) Ltd.

BY ORDER OF THE COURT
Sd/- M/S.G.Sudhakar Reddy
Advocate
Plot No.131, Sai Ram Nagar Colony, Champapet, Hyderabad.
Ph: 9848470673
Counsel for the Petitioners

## తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాల ఉత్సవాలు

**: మలక్ పేట కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ షేక్ అక్బర్**



దేవాలయ నిర్వాహకులకు చెక్కులను పంపిణీ చేస్తున్న మలక్ పేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ షేక్ అక్బర్ తదితరులు

**మలక్ పేట ,జూలై 8, ప్రభాతవార్త:** బోనాల ఉత్సవాలు తెలంగాణ సాంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని మలక్ పేట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ షేక్ అక్బర్ పేర్కొన్నారు. బోనాల పండుగను పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం తరఫున దేవాలయాల నిర్వాహకులకు మలక్ పేట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ షేక్ అక్బర్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పలు పథకాలను ప్రవేశపెట్టి వారి అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేస్తుందని తెలిపారు. ప్రజలందరూ కలిసిమెలిసి శాంతియుత వాతావరణం లో ప్రశాంతంగా ఉత్సవాలను జరుపుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రేటర్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బాబు శ్రీనివాస్, ఓ బి సి సెల్ వైస్ చైర్మన్ చౌకీ రవికుమార్, నాయకులు కే. యం. అశ్వాక్ ఖాన్, అశోక్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న రవీంద్రచారి

**హయత్ నగర్, జులై 8 ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, కార్మికులకు వ్యతిరేకంగ తీసుకువచ్చిన 4 కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్ రెడ్డి పిలుపు నిచ్చారు. హయత్ నగర్, రావి నారాయణరెడ్డి కాలనీలో మంగళవారం నిర్వహించిన వేరు వేరు సమావేశాలలో వారు మాట్లాడుతూ.... కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం 26,000 అమలు చేయాలని, పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధ రించాలని, విశిళీ, గిశిళీ ను రద్దు చేయాలని, స్కీన్ వర్కర్స్ కి కనీస వేతనం అమలు చేయాలని, ఈఎస్ఐ, పిఎఫ్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. వ్యవసాయ ఉత్పత్తు లకు కనీస మద్దతు ధర చట్టాన్ని అమలుచేయాలని డిమాండ్ చేశారు.దీనికోసం కార్మిక సంఘాలు ఐక్య పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో నాయకులు హరిసింగ్ నాయక్, కేత రాజు నర్సింహా,మందుల కృష్ణ,మర్రి శోభన్,ప్రసాద్, పాల్గొన్నారు.

## గురు పౌర్ణమికి ఘనంగా ఏర్పాట్లు

**హుడా కాంప్లెక్స్, జులై 8, ప్రభాతవార్త:** దక్షిణ షిరిడి గా పేరు గాంచిన దిల్ షుక్ నగర్ సాయిబాబా దేవాలయం లో గురు పౌర్ణమి వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నామని సాయి బాబా దేవాలయం అధ్యక్షుడు శ్యాం కుమార్ తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, భక్తులు అధిక సంఖ్యలో వచ్చి దర్శించుకోవాలని కమిటీ సభ్యులు కోరారు. 36 సంవత్సరాలుగా దిల్షుక్ నగర్ సాయి బాబా దేవాలయం లో గురు పౌర్ణమిని వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నామని చైర్మన్ శ్యామ్ కుమార్ తెలిపారు. 09 నుండి 11 తేదీ వరకు గురు పౌర్ణమి వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. సరూర్ నగర్ సీఐ సైది రెడ్డి గురుపౌర్ణమి సంబందించిన భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలని కమిటీ సభ్యులకు పలు సూచనలు చేయడం జరిగిందనీ తెలిపారు.

## ఉచిత వైద్య శిబిరాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలి: ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి



వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి

**హుడా కాంప్లెక్స్, జులై 8, ప్రభాతవార్త:** ఉచిత వైద్య శిబిరాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలనీ గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి సూచించారు. డివిజన్ పరిధిలోని పి టీ కాలనీ కమ్యూనిటీ హాల్లో మంగళవారం ఓజోన్ హాస్పిటల్స్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యమే నా లక్ష్యం. సామాన్య ప్రజలకు చేరువలోనే వైద్య సేవలు అందించేందుకు ఇలాంటి శిబిరాలను తరచూ నిర్వహిస్తాం అని పేర్కొన్నారు. ఆయన స్వయంగా వైద్య పరీక్షలు చేయించుకుని ప్రజలలో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేలా ప్రోత్సహించారు.ఈ శిబిరంలో క్యాన్సర్ స్క్రీనింగ్, షుగర్, బీపీ, బిశితీళీ, నిదిబి పరీక్షలు, కార్డియాలజీ, జనరల్ వైద్య సలహాలు, దంత వైద్య పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పి టీ కాలనీ అధ్యక్షులు అశోక్, సతీష్, ఓంకార్, శ్రీకాంత్, శివ రామ్, రత్నం, ఓషన్ హాస్పిటల్స్ సిబ్బంది వివేక్ మరియు లయన్స్ క్లబ్ బృందం మరియు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సహాయసహకారాలు అందించాలి : విజయ్ నేత



విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ పంపిణీ చేస్తున్న గద్దె విజయ్ నేత, శ్రీదేవి తదితరులు

**వనస్థలిపురం. జులై. 8.ప్రభాతవార్త :** బి.యన్.రెడ్డి.నగర్ డివిజన్ లో గల ప్రభుత్వ మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల లో ఎం. ఎం. ఫౌండేషన్,బి.యన్.రెడ్డి.నగర్ డివిజన్ టి .డి.పి. అధ్యక్షుడు గద్దె విజయ్ నేత ల సహకారం తో విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, పెన్నులు,పెన్సిళ్లు,స్కేల్స్,బిస్కెట్స్,స్టీల్ ప్లేట్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా విచ్చేసిన సామాజిక వేత్త శ్రీదేవి, వెంకటేశ్వర రావు ల చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా విజయ్ నేత మాట్లాడుతూ పేద విద్యార్థుల విద్యకు సహాయసహకారాలు అందించడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు జయమ్మ,నాగరాజు,ప్రసన్నాసురేశ్ చారి తదితరులు పాల్గొన్నారు.

## రోల్ మోడల్‌గా చర్లపల్లి పారిశ్రామిక వాడను అభివృద్ధి చేస్తాం

**చర్లపల్లి ఐల, సిఐఏ అధ్యక్షులు గోవిందరెడ్డి శ్రీనివాస్ రెడ్డి**




ఎన్నికల్లో విజయం సాధించిన నూతన కార్యవర్గం దృశ్యం.

**కుషాయిగూడ, జులై 8,ప్రభాతవార్త.** పారిశ్రామికవేత్తల సహకారంతో చర్లపల్లి పారిశ్రామికవాడను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి రోల్ మాడల్ గా.తిర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నమని నూతనంగా ఎన్నికైన చర్లపల్లి ఐలా చైర్మాన్ కె.గోవిందరెడ్డి, సిఐఎ అధ్యక్షుడు డి. శ్రీనివాస్ రెడ్డి లు అన్నారు. చర్లపల్లి ఐలా, సిఐఎ కమిటీలకు నూతనంగా ఎన్నికైన పాలకవర్గం ప్రతినిదులు సోమవారం సిఐఎ భవన్ లో విలేకర్లతో మాట్లాడారు. ఈసందర్భంగా గోవిందరెడ్డి మాట్లాడుతు చర్లపల్లి రైల్వే స్టేషన్ కు రద్దీ పెరిగిన దృష్యా పారిశ్రాకవాడలోని ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రాహదారులను 10 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తామని తెలిపారు. అలాగే పారిశ్రామికవాడలోని ఐదు ఫేజులలో సీవరేజ్ ప్లాంట్లు భూగర్భ డ్రైనేజీ, ఒపెన్ డ్రైనేజీల అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. పారిశ్రామికవాడలో పని చేసే కార్మికుల కోసం అడ మగా వారి కోసం ప్రత్యేకంగా హస్టల్ నిర్మాణం, కార్మికుల కోసం క్యాంటిన్ నిర్మాణానికి ప్రణాలికలు రూపొందించినట్టు తెలిపారు. రక్షణ వ్యవస్థను పరిష్టపరిచేందుకు పోలీసు వారితో కలసి సిసి కెమెరాల ఏర్పాటుచేస్తామని తెలిపారు. సిఐఎ అధ్యక్షుడు డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కార్మికుల అరోగ్య పరిరక్షణ కోసం ఈఎస్ఐ ఆసుపత్రిలో సౌకర్యాలు మెరుగుపర్చడంతో పాటు ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తామని అన్నారు. కార్మికులకు ఇన్సూరెన్స్ తో పాటు వివిద పరిశ్రమలలో పని చేసేందుకు యువతకు శిక్షణ కల్పించి స్కిల్ డెవలప్మెంట్ చేస్తామని తెలిపారు.ముఖ్యంగా మహిళ కార్మికులకు సరైన సౌకార్యలు కల్పించేందుకు మహిళ పారిశ్రామికవేత్తలతో చర్చించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. బ్యాంకర్ల సమావేశమై పారిశ్రామిక ఉత్పత్తుల ఎగుమతులు, లోన్లు వంటి పలు అంశాలపై పని చేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఐలా కార్యదర్శి జి.రఘువయ్య, ఉపాధ్యాక్షుడు తాటి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి పి.సురేష్, కోషాధికారి ఇ.మల్లిఖార్జున్ రెడ్డి , సీఐఎ వై. సుధాకర్ రెడ్డి కార్యదర్శి పిఎస్ మోహన్, సంయుక్త కార్యదర్శి ఎమ్.గంగాధర్ బాబు, కోషాధికారి ఎన్.శ్రీనివాన్, పారిశ్రామికవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



మార్కెట్లో సీసీ కెమెరాల పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఇంచార్జ్ చిలక నరసింహారెడ్డి, ఏసిపి సుబ్బరామిరెడ్డి, ఇన్ స్పెక్టర్ బ్రహ్మ మురారి, చిత్రంలో ట్రేడర్స్ అధ్యక్షుడు చేగురి వెంకటరమణ తదితరులు

**మలక్ పేట,జులై 8 , ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని మలక్ పేట ఏసిపి సుబ్బ రామిరెడ్డి, హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ ఫుల్ అడిషనల్ చార్జ్ ఉన్నతశ్రేణి కార్యదర్శి చిలకా నర సింహారెడ్డిలు పేర్కొన్నారు. మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్ కార్యాలయంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఇంచార్జ్ ఉన్నతశ్రేణి కార్యదర్శి చిలకా నరసింహారెడ్డి ఆధ్వర్యంలో వ్యాపారస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యాపారస్తుల తమ షాప్ ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. షాపుల్లో పనిచేసే సిబ్బందికి గుర్తింపు కార్డులను ఇవ్వాలని, సెక్యూరిటీ గార్డులు యూనిఫాంలు ధరించాలని తెలిపారు. అనంతరం కొద్దిరోజుల క్రితం మార్కెట్లోని ఓ షాప్ వద్ద రూ. 6.50 లక్షల నగదు దొంగతనం కేసులో నిందితుడిని 24 గంటలలో పోలీసులు అదుపులోకి తీసుకుని నగదు ను స్వాధీనం చేసుకోవడంతో మలక్ పేట్ ఏసిపి సుబ్బరామిరెడ్డి, చాదర్ ఘాట్ ఇన్ స్పెక్టర్ బ్రహ్మ మురారి లను ఇన్చార్జ్ ఉన్నత శ్రేణి కార్యదర్శి చిలక నరసింహ రెడ్డి శాలువాలతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చాదర్ ఘాట్ ఇన్ స్పెక్టర్ బ్రహ్మ మురారి, తెలంగాణ చాంబర్ ఆఫ్ అగ్రి ట్రేడర్స్ అధ్యక్షుడు చేగురి వెంకటరమణ, డైరెక్టర్లు కిషన్ సింగ్, మాదారం కృష్ణ, వ్యాపారస్తులు చిగుమల్ల శంకర్, వంజరి రమేష్, బాలాజీ, అశోక్, వెంకటరమణ, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కామినేని చౌరస్తాలో డాక్టర్ వైయస్ఆర్ విగ్రహ ఆవిష్కరణ



వైయస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, రామ్మోహన్‌గౌడ్,

**ఎల్.బి.నగర్, జులై 8 ప్రభాతవార్త:** దివంగత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి 76వ జయంతి సందర్భంగా కామినేని చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన వైయస్సార్ విగ్రహాన్ని టీపీసీసీ ప్రతినిధి సీనియర్ నాయకులు జక్కిడి ప్రభాకర్ రెడ్డి ఆవిష్కరించారు. జెక్కిడి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో వైయస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జక్కిడి మాట్లాడుతూ సంక్షేమానికి కొత్త నిర్వచనం ఇచ్చి పేదవాడి జీవితానికి భరోసా ఇచ్చి వైయస్సార్ తెలుగు ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. వైయస్సార్ ఆశయాల సాధనే లక్ష్యంగా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతామన్నారు. వైయస్సార్ తో తనకున్న అనుభూతిని కార్యకర్తలతో పంచుకున్నారు. ఎల్. బి నగర్ నియోజకవర్గంలో ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తకు తను అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు ఈశ్వరమ్మ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, మాజీ ఫ్లోర్ లీడర్ బద్దుల వెంకటేష్ యాదవ్, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్యాల జయపాల్ రెడ్డి, కర్మాన్ఘాట్ ఆంజనేయస్వామి ఆలయ డైరెక్టర్ జనంపల్లి విష్ణువర్ధన్ రెడ్డి , పోలేపల్లి చంద్రారెడ్డి , రాం రెడ్డి, మంజులరెడ్డి, కే.శశిధర్ రెడ్డి, కళ్లెం నర్సింహా రెడ్డి, ఎర్రంబెల్లి సతీష్ రెడ్డి, వెంకటేష్ యాదవ్,వెంకటేష్ చారీ,తోడ్డి గవర్దన్,జైపాల్ రెడ్డి,డైక్టర్,యాదయ్య,జితేందర్, శివ. వెంకటేష్ పాల్గొన్నారు.

## పార్కు స్థలాలను కాపాడడంలో బడంగ్‌పేట్ కమిషనర్ నిర్లక్ష్యంపై బిజెపి పోరు

**-వరుస ఆందోళనలతో అట్టుడికిన మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో, రహదారిపై, పిఎస్‌లో ధర్నాలు చేసిన నేతలు**

**-పోలీసుల రంగప్రవేశం.. నేతల అరెస్టు.. పిఎస్‌కు తరలింపు**



బడంగ్‌పేట్ కమీషనర్ తీరును నిరసిస్తూ ఆర్అండ్‌బి రోడ్డుపై బైఠాయించిన బిజెపి నేతలు..

**సరూర్‌నగర్, జులై 8 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అన్యాక్రాంతమైన పార్కు స్థలాలు, ఓపెన్ స్థలాలు కాపాడడంలో కమీషనర్ నిర్లక్ష్యం వహించడమే కాకుండా కబ్జాదారులకు కొమ్ముకాస్తున్నారని ఆరోపిస్తూ మంగళవారం బిజెపి తలపెట్టిన ఆందోళన కార్యక్రమాలు కార్పొరేషన్‌ను అట్టుడికించాయి. కార్పొరేషన్‌లో దాదాపు రూ.40 కోట్ల విలువ చేసే సుమారు 11,500 గజాల పార్కు స్థలాలు, ఓపెన్ ప్లేస్‌లను పరిరక్షించాలని పలు మార్లు వినతి పత్రాలు సమర్పించినా పట్టించుకోకపోవడంతో కార్పొరేషన్ బిజెపి అధ్యక్షులు రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి, రామిడి వీరకర్ణారెడ్డి, మాజీ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకటరెడ్డిల ఆధ్వర్యంలో బిజెపి నేతలు కార్పొరేషన్ ప్రధాన ద్వారం మెట్ల వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అయితే చాలా సేపటి తర్వాత అక్కడికి వచ్చిన కమీషనర్ సరస్వతిని పార్కు స్థలాల్లో భవన నిర్మాణాలు జరుగుతున్నా చర్యలు తీసుకోకపోవడంపై ప్రశ్నించారు. కోర్టు కేసులో ఉన్నదని పేర్కొంటూ కమీషనర్ వారిచ్చిన వినతి పత్రాన్ని తీసుకొని తన ఛాంబర్‌లోకి వెళ్ళారు. కాగా కోర్టు కేసుకు సంబంధించి పత్రాలు చూపించాలని డిమాండ్ చేస్తూ బిజెపి నేతలు అక్కడే బైఠాయించి ఆందోళన కొనసాగించారు. ఆ తర్వాత వారంతా మూకుమ్మడి కార్పొరేషన్ సమీపంలోని చౌరస్తా పక్కన ఆర్అండ్‌బి రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు.

**ట్రాఫిక్ జామ్.. ఆందోళనకారులను పక్కకు తొలగించిన పోలీసులు**

బిజెపి నేతల ధర్నాతో ప్రధాన రోడ్డుపై ట్రాఫిక్ స్థంభించిపోయింది. కమీషనర్ డౌన్ డౌన్.. కబ్జాకారులకు కమీషనర్ కొమ్ముకాస్తున్న కమీషనర్.. అక్రమ కట్టడాలను ప్రోత్సహిస్తున్న కమీషనర్ అంటూ బిజెపి నేతలు నడిరోడ్డుపై పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ ఆందోళనను ఉధృతం చేశారు. దీంతో అక్కడ ట్రాఫిక్ స్థంభించడంతో రంగంలో దిగిన మీర్‌పేట్ పోలీసులు వారికి నచ్చజెప్పినా ఫలితం లేకపోవడంతో బలవంతంగా పక్కకు తొలగించారు. దీంతో జరిగిన పెనుగులాటలో రామకృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డిల చొక్కాలు పాక్షికంగా పాడయ్యాయి. అనంతరం వారు చొక్కాలను విప్పి రోడ్డు పక్కనే పార్టీ నేతలతో కలిసి ధర్నాను కొనసాగించారు. ఇక గత్యంతరం లేక పోలీసులు వారందరినీ బలవంతంగా పోలీసు వాహనంలో పిఎస్‌కు తరలించారు. అయితే పిఎస్ ఆవరణలో కూడా బిజెపి నేతలు బైఠాయించి కమీషనర్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేశారు. ఈ నేపథ్యంలో స్పందించి మీర్‌పేట్ డిఐ గౌరీ నాయుడు ఆందోళన చేస్తున్న బిజెపి నేతలతో చర్చించి వారికి నచ్చజెప్పడంతో వారు ఎట్టకేలకు శాంతించారు. ఆద్యంతం కలకలం రేపిన వరుస ఆందోళన కార్యక్రమాల్లో మాజీ కార్పొరేటర్లు గడ్డం లక్ష్మారెడ్డి, దడిగ శంకర్, మాజీ ఎంపిటిసి తర్రె మల్లేష్ యాదవ్, సీనియర్ నాయకులు జక్కిడి మధుసూదన్‌రెడ్డి, మంగపతి నాయక్, కొంతం ప్రకాశ్‌రెడ్డి, కుంటి భాస్కర్, తీగల సురేందర్‌రెడ్డిల తో పాటు పలువురు పాల్గొన్నారు.

## బండ్లగూడ ఖాల్సా రైతులకు పంట రుణాలు ఇస్తున్నాం సొసైటీ ఛైర్మన్ సింగిరెడ్డి పెంటారెడ్డి

**సరూర్‌నగర్, జులై 8 ప్రభాతవార్త:** వర్షాకాలం రబీ వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో బాలాపూర్ కేంద్రంగా పని చేస్తున్న బండ్లగూడ ఖాల్సా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం తరఫున రైతులకు పంట రుణాలను ఇస్తున్నామని సంఘ ఛైర్మన్, రంగారెడ్డి–హైదరాబాద్ కేంద్ర సహకార బ్యాంకు (డిసిసిబి) మాజీ ఛైర్మన్ సింగిరెడ్డి పెంటారెడ్డి తెలిపారు. కూరగాయలు సాగు చేసే రైతులకు ఎకరానికి రూ.55 వేలు (గుంటకు రూ.1375), వరి సాగు చేసే రైతులకు ఎకరానికి రూ.46 వేలు (గుంటకు రూ.1150)లు ఇస్తున్నామని ఆయన వివరించారు. వ్యవసాయ భూమి ఉండి పట్టాదారు పాసు పుస్తకం క్లియర్ టైటిల్ ఉన్న వారికి రుణాలు ఇస్తామని తెలిపారు. రుణ మాఫీ అయిన రైతులతో పాటు కొత్తగా రుణం తీసుకోదలచిన వారికి సైతం రుణ సదుపాయం కల్పిస్తున్నామని ఆయన వెల్లడించారు. ఈ నేపథ్యంలో సొసైటీ పరిధి కిందకు వచ్చే బాలాపూర్, మల్లాపూర్, సుల్తాన్‌పూర్, రేణుకాపూర్, మైలార్‌దేవ్ పల్లి, బండ్లగూడలకు చెందిన రైతులు పంట రుణాల కోసం దరఖాస్తు చేసిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు బాలాపూర్‌లోని సొసైటీ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ నెల 15వ తేదీ లోపు రుణాల కోసం సొసైటీ దృష్టికి తెచ్చి రుణ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని పెంటారెడ్డి కోరారు.



బోడుప్పల్ టెలిఫోన్ కాలనీలో శ్రీ రేణుక ఎల్లమ్మ కళ్యాణానికి హాజరైన మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ,మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి , మాజీ జెడ్పిటిసి సభ్యులు మంద సంజీవరెడ్డి ,మాజీ కార్పొరేటర్లు తదితరులు



నాదర్‌గుల్‌లో వైఎస్ఆర్‌కు నివాళులర్పిస్తున్న మాజీ సర్పంచ్ మర్రి హన్మంత్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి కందాడి శ్రీరాంరెడ్డి, వైస్ ఛైర్మన్ బంగారు బాబు, సుభాన్ యాదవ్ తదితరులు

## ప్రజల అభ్యున్నతి కోసం డాక్టర్ వైయస్ కృషి

**: వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మస్రత్ సుల్తానా**



దివంగత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మస్రత్ సుల్తానా తదితరులు

**మలక్ పేట ,జూలై 8 ,ప్రభాతవార్త:** దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి పేద ప్రజల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేశారని హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మస్రత్ సుల్తానా పేర్కొన్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని పురస్కరించుకుని డైరెక్టర్ మస్రత్ సుల్తానా ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి సదా చిరస్మరణీయుడని, ఆయన చేసిన సేవలు ఎనలేనివని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయాల నిర్వాహకులకు చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, జులై 8 ప్రభాతవార్త:** బోనాల ఉత్సవాలకు సంబంధించి జిహెచ్ఎంసి నుంచి మంజూరైన చెక్కులను మూడు గుళ్ళు, రెడ్డి బస్తీలోని అమ్మవారి దేవాలయాల నిర్వాహకులకు కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అరుణ మాట్లాడుతూ బోనాల పండుగ తెలంగాణా సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. డివిజన్‌లోని అమ్మవారి దేవాయాలను బోనాల పండుగకు ప్రత్యేకంగా ముస్తాబు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానికులు పాల్గొన్నారు.

## త్వరలో నాలా నిర్మాణ పనులు ప్రారంభిస్తాం : కార్పొరేటర్



అధికారులకు సూచనలు చేస్తున్న కార్పొరేటర్ శ్వేత మధుకర్‌రెడ్డి

**సైదాబాద్, జులై 8 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్‌లోని జె.ఎస్.రెడ్డి స్విమ్మింగ్ పూల్ బాలాజినగర్ నుండి కృష్ణానగర్ కాలనీ వరకు బాక్స్ నాలా మంజూరు కావడంతో కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి మంగళవారం ప్రాజెక్ట్ ఎఇ రోహిణి, డిఇ ఉమా మహేశ్వరి, ఎఇ భరత్‌లతో కలిసి నాలా నిర్మాణం చేపట్టనున్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్వేత మాట్లాడుతూ నాలా పనులు సాధ్యమైనంత త్వరగా ప్రారంభించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, కాలనీవాసులు యాదయ్య, శంకర్‌రెడ్డి, మల్లేష్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ జయంతి



డాక్టర్ వైఎస్ఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీపాల్‌రెడ్డి

**సైదాబాద్, జులై 8 ప్రభాతవార్త:** చంపాపేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాచర్లపల్లి శ్రీపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను చంపాపేటలో ఘనంగా నిర్వహించారు. కర్మన్‌ఘాట్‌లోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగు ప్రజల హృదయాల్లో దివంగత వైఎస్ఆర్ చెరగని ముద్ర వేసి చిరస్మరణీయుడిగా నిలిచిపోయారని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి నివాళి



డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్

**సైదాబాద్, జులై 8 ప్రభాతవార్త:** మాజీ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సేవాదళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ట్రాఫిక్ అవేర్‌నెస్ కార్యక్రమం




పాల్గొన్న సౌత్‌ఈస్ట్ జోన్ ఎసిపి చంద్ర కుమార్, సంతోష్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ ఆసిఫ్‌లు

**సైదాబాద్, జులై 8 ప్రభాతవార్త:** సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో వికాస్ హై స్కూల్‌లో విద్యార్థులకు ట్రాఫిక్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సౌత్‌ఈస్ట్ జోన్ ఎసిపి చంద్ర కుమార్, సంతోష్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ ఆసిఫ్‌లు మాట్లాడుతూ రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాల గురించి వివరించారు. పాదచారులు, సైక్లిస్టులు బాధ్యతాయుతంగా ఎలా వ్యవహరించాలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకటప్ప, టిటిఐ హెచ్‌సి వేణు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు ఉప్పల ఆర్థిక సహాయం



క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

**ఎల్.బి.నగర్, జులై 8 ప్రభాతవార్త:** ఉత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని టిపిసిసి ప్రధాన కార్యదర్శి, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త పేర్కొన్నారు. అండర్ 13 డబుల్స్ విభాగంలో నేషనల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన పొద్దుటూరి అన్య, వైభవ్ రమ్యని నాగోల్ లోని ఉప్పల నివాసంలో మంగళవారం వారిని సన్మానించి ఇద్దరికీ తలో రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని శ్రీనివాస్ గుప్తా అందజేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులను అభినందించారు.జాతీయ స్థాయిలో అత్యున్నత ప్రతిభ కనబరిచి సమాజానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు.క్రీడాకారులకు ఉప్పల ఫౌండేషన్ ద్వారా అనేక సేవా సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కోశాధికారి హర్ష , క్రీడాకారుల తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ సేవలు చిరస్మరణీయం: దేప భాస్కర్‌రెడ్డి



వైయస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న భాస్కర్ రెడ్డి, గణేష్‌నేత, ఉపేందర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, జులై 8 ప్రభాతవార్త:** ప్రజా సేవకు తమ రాజకీయ జీవితాన్ని అంకితం చేసిన వైయస్సార్ సేవలు చిరస్మరణీయమని దేప భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. వైయస్సార్ 76వ జయంతి సందర్భంగా ఆర్కే పురం డివిజన్ చిత్రలేఅవుట్ లోని వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకొనిరావడానికి రాష్ట్రమంతా పాదయాత్ర చేసి పార్టీకి అధికారాన్ని కట్ట బెట్టిన ధీశాలి అన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు పాటు పడ్డారనీ కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న గణేష్ నేత, బండి మధు, ఖిల్లా మైసమ్మ చైర్మన్ సురేష్, ఎస్.కె. మహమ్మద్, ముస్కు అంజిరెడ్డి, రాజు నాయక్, లింగస్వామి గౌడ్, పగడాల ఎల్లయ్య, కిరణ్, శ్రీశైలం, రామకృష్ణ గౌడ్, పెద్దవూర సైదులు, నబి, జగన్నాథం, సలీం,విప్లవ రెడ్డి,నాను, మారం సుజాత రెడ్డి, మాధవి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వరల్డ్ పారా అథ్లెటిక్ డిస్క్‌త్రోలో లోకేశ్వరికి కాంస్యం



లోకేశ్వరిని అభినందిస్తున్న ప్రముఖులు

**హుడా కాంప్లెక్స్ , జులై 8, ప్రభాతవార్త:** వరల్డ్ పారా అథ్లెటిక్ పోటీలలో డిస్క్ త్రో విభాగం లో తెలంగాణ రాష్ట్ర, రంగారెడ్డి జిల్లా, సరూర్ నగర్ కు చెందిన లోకేశ్వరి సత్తా చాటి కాంస్య పతకాన్ని సాధించింది. జూలై 1 వ తేదీ నుండి 6 వ తేదీ వరకు చెక్ రిపబ్లిక్ దేశంలో ఓలోమోక్ నగరంలో టిజె లోకోమోటివ్ ఓలోమౌస్ అథ్లెటిక్ స్టేడియంలో జరిగిన వరల్డ్ పారా అథ్లెటిక్స్ ఉమెన్స్ గ్రాండ్ ప్రిక్స్ 2025 నందు తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా సరూర్నగర్ ద్రోణాచార్య పారా స్పోర్ట్స్ అకాడమీ ద్వారా శిక్షణ పొందుతున్న కుదుముల లోకేశ్వరి డిస్కస్ త్రో విభాగంలో కాంశ్య పతకం సాధించడం జరిగింది. లోకేశ్వరికి సరూర్ నగర్ లో ఘనస్వాగతం పలికారు.కార్యక్రమంలో ద్రోణాచార్య పారా స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు, మరియు వెంకటేశ్వర కాలనీ పెద్దలు పాలొన్నారు.

## 9న జరిగే సమ్మెను జయప్రదం చేయాలి

**-ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య**

**తూర్కయంజాల్ జులై 8,ప్రభాతవార్త :** దేశవ్యాప్తంగా ఈ సమ్మెలో 20 కోట్ల మంది కార్మికుల పాల్గొనబోతున్నారని అన్నారు. మోడీ కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్ లుగా మార్చడం వలన కార్మికుల పనిగంటలు 12 గంటలకు పెరుగుతుందని అన్నారు. అనేక కార్మిక చట్టాలు రద్దు అవుతున్నాయని అన్నారు. దీనివలన యాజమాన్యాల లాభాలు పెరిగి కార్మికులు బానిసలుగా తయారవుతారని అన్నారు. తద్వారా ఆర్థిక అసమానతలు పెరిగి దేశ అభివృద్ధికి, శాంతిభద్రతలకు ఆటంకంగా తయారవుతుందని అన్నారు. లేబర్ కోడలు రద్దు కోసం కనీస వేతనం 26,000 చేయాలని, 8 గంటల పని దినాన్ని అమలు చేయాలని, కార్మిక చట్టాలను అమలు చేయని యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సమ్మె ద్వారా దేశవ్యాప్తంగా కార్మికుల డిమాండ్ చేయబోతున్నారని అన్నారు.



డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 76వ జయంతి సందర్భంగా అల్మాస్‌గూడలో ఆయన విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ మేయర్ పారిజాత, సీనియర్ నాయకులు నవారు మల్లారెడ్డి, బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి తదితరులు



మంద మల్లమ్మ చౌరస్తా వద్ద వైఎస్ఆర్ విగ్రహానికి నివాళులర్పించిన టిపిసిసి ప్రచార కమిటీ సభ్యుడు సామిడి గోపాల్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి సామిడి చరణ్‌రెడ్డి. పద్మారెడ్డి తదితరులు